సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ¦ 11 ¦ డిసెంబర్ ¦ 2023



క్రీడా పర్వం

ఆడుదాం ఆంధ్రా పోటీలు 15న ప్రారంభం కానున్నాయి. రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

- 8లో



రైలు కింద పడి ఆత్మహత్య

ఓ వివాహిత రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య చేసుకున్నారు. కాశీబుగ్గ పరిధిలో ఘటన జరిగింది.

- 8లో

లొంగిపోయిన క్యాషియర్

శ్రీకాకుళం క్రైమ్ : గార స్టేట్‌బ్యాంకు బంగారం మాయం కేసులో కీలక వ్యక్తి, పరారీలో ఉన్న బ్యాంకు క్యాషియర్ ముంజి సురేష్ లాయర్ ద్వారా పోలీసులకు లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఈ కేసులో ఉన్న తొమ్మిది మందిలో ఏడుగురిని అరెస్టు చేయగా, ఏ-1గా ఉన్న స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.

న్యూస్‌రీల్

బీచ్‌ల వద్ద ప్రమాద హెచ్చరికలు



బుడగుట్లపాలెం తీరంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బుడగుట్లపాలేం, రాళ్లపేట, పాతదిబ్బలపాలేం బీచ్‌ల్లో గతంలో యువకులు, విద్యార్థులు గల్లంతు వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బీచ్‌లను ఆదివారం సందర్శించారు. బీచ్‌ల వద్ద ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో దిగవద్దని సూచించారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కేంద్రపురావస్తు శాఖ ఏడీ



పురావస్తు శాఖ అధికారికి శిఖర దర్శనం చేయిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని అమరావతి సర్కిల్ కేంద్ర పురావస్తు శాఖ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలతోపాటు వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖర దర్శనం చేయించి ఆలయ విశేషాలు, స్థల పురాణం వివరించి స్వామి శేషవస్త్రాలు అందించి పుణ్యాహవచనాలతో దీవించారు. ఆయనతోపాటు అర్చకులు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై ధాన్యపు రాశులు



అల్లాడలో రోడ్డు మీద ధాన్యం ఎండబెట్టిన దృశ్యం

జలుమూరు: నాలుగు రోజులుగా ఎండ కాయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఆందోళన చెందిన రైతన్నలు ఇప్పటికే నూర్పిడి అయిన ధాన్యం మిల్లులకు తరలించారు. అలాగే యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆర బెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మిల్లులకు తరలించడం వేగవంతం కావడంతో ప్రభుత్వం నుంచి మంచి మద్దతు ధర కూడా లభిస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు



నిర్వాహకుల నుంచి ట్రోఫీ, పతకాలు అందుకుంటున్న జిల్లా మహిళల జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సీనియర్స్ మహిళ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు సీనియర్స్ మహిళ విభాగంలో జిల్లా జట్టు పతకం సాధించలేదు. ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అనంతపురం జిల్లా పెనుమర్తి మండలం, గొల్లపల్లి వేదికగా ఈ నెల 8 నుంచి 10 వరకు 9వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచి ట్రోఫీతోపాటు కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకుంది. దీంతో శ్రీకాకుళం జిల్లా జట్టు సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మూడు విభాగాల్లోను పతకాలు సాధించినట్టైంది.

టీకా.. టీవిగా



పిల్లలకు టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

- నేటి నుంచి మిషన్ ఇంద్రధనుష్
- ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఉచితంగా వ్యాక్సిన్లు
- కొరత లేకుండా సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- వంద శాతం వ్యాక్సినేషన్‌కు ఏటా చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 24,868 మంది చిన్నారులకు టీకాలు



నరసన్నపేట: ప్రమాదకర వ్యాధుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకు టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమర్థంగా అమలు చేస్తోంది. అయినా అక్కడక్కడా కొందరు చిన్నారులు వ్యాక్సిన్ వేసుకోకుండా మిగిలిపోతున్నారు. వారిని గుర్తించి కావాల్సిన వ్యాక్సిన్లు వేసేందుకు ప్రభుత్వం మిషన్ ఇంద్రధనుష్ పేరిట ప్రత్యే క కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సోమవారం నుంచి నెల 16 వరకు జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఉచితంగా టీకాలు వేయనున్నారు. దీనికోసం వైద్య సిబ్బంది ఊరూరా జల్లెడ పడతారు.

అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పెరిగి పెద్దయిన పిల్లల వరకూ వారికి అవసరమైన టీకాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుంది. ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, పోలియో, హెపటైటిస్–బి, చికెన్‌పాక్స్ వంటి వ్యాధుల నుంచి రక్షణకు టీకాలు వేస్తారు. గతంలో టీకా వేయించుకోవాలంటే పిల్లలు భయపడేవారు. తల్లిదండ్రులూ అంతగా ఉత్సాహం చూపేవారు కాదు. ఇప్పుడు పూర్తిగా అవగాహన పెరగడంతో అపోహలు తొలగి ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు టీకాలు వేయడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఏటా 95 శాతం పైబడి వ్యాక్సినేషన్ జరుగుతోంది.

ప్రతి మొదటి బుధ, శనివారాల్లో..

జిల్లాలోని 30 మండలాల్లో 68 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 18 కమ్యూనిటీ ఆస్పత్రులు, ఒక ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. వీటిల్లో ప్రతి నెల మొదటి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ వేస్తున్నారు. అలాగే రెండో బుధ, శనివారాల్లో కూడా వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన టీకాలను జిల్లా ఇమ్యూనైజేషన్ కేంద్రం నుంచి అధికారులు చేరవేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో టీకాలు నిల్వ ఉంచేందుకు వీలుగా అవసరమైన ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు.

మూడో విడత మిషన్ ఇంద్ర ధనుష్‌లో భాగంగా వ్యాక్సిన్లు ఇంకా వేసుకోని పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేస్తారు. వంద శాతం చిన్నారులు వ్యాక్సిన్లు వేయడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

పిల్లలకు వేసే టీకాలు..

- శిశువు జన్మించిన సమయంలో.. బీసీజీ, ఓపీవీ జీరో మోతాదు, హెపటైటిస్–బి.
- ఆరు వారాలకు ఓపీవీ–1, పెంటావాలెంట్–1, రోటా–1,ఎఫ్ఎల్‌పీవీ–1,పీసీవీ–1
- పది వారాలకు ఓపీవీ–2, పెంటావాలెంట్–2, రోటా–2
- పద్నాలుగు వారాలకు ఓపీవీ–3, పెంటావాలెంట్–3, రోటా–3, ఎఫ్ఎల్‌పీవీ–2, పీసీవీ–2
- 9 నెలలకు మీజిల్స్–1/ఎంఆర్–1, విటమిన్–ఎ, జేఈ–1, పీసీవీ–బీ.
- 16 నుంచి 24 నెలలకు డీపీటీ మొదటి బూస్టర్ డోస్, ఓపీవీ బూస్టర్ డోస్, మీజిల్స్–2/ఎంఆర్–2,జేఈ–2.
- 5 నుంచి ఆరేళ్లకు డీపీటీ రెండో బూస్టర్ మోతాదు, 10,16 సంవత్సరాలకు టీటీ వేస్తారు.

కొరత లేకుండా వ్యాక్సిన్లు



వంద శాతం మందికి వ్యాక్సినేషన్ చేయడానికి 11వ తేదీ నుంచి మిషన్ ఇంద్రధనుష్ నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్ల పిల్లల వరకూ అన్ని రకాల వ్యాక్సిన్లు అవసరం మేరకు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నాం. ఎక్కడా కొరత లేదు. ఇప్పుడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ అందుబాటులోకి రావడంతో వాక్సిన్లు వేయడం మరింత సులభమైంది. మిషన్ ఇంద్ర ధనుష్‌ను విజయవంతం చేయాలి.

– ఐ.ఈశ్వరి దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, శ్రీకాకుళం

14న సీఎం రాక



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- ఒక రోజు ముందే జిల్లాకు వస్తున్న సీఎం వైఎస్ జగన్

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 15న సీఎం పర్యటన జరగాల్సి ఉండగా తాజాగా ఒక రోజు ముందుకు మార్చినట్లు రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 14న సీఎం రానున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని మంత్రి పిలుపునిచ్చారు.

'సీఎంకు ఘన స్వాగతం పలుకుదాం'

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలుకుదామని మంత్రి సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. సీఎం పలాస రానున్న నేపథ్యంలో ఆయన ఆదివారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వార్డు ఇన్‌చార్జి మార్పు యుగంధర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పలాసపై సీఎం చూపిస్తున్న అభిమానానికి సమానంగా సీఎంపై ప్రేమ కురిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బి.కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ శంకర్, ప్రభుత్వం విప్ శంకర్‌పండా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథం





- రూ.8 లక్షలతో మరుగుదొడ్లు కట్టించారు..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జీడి కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతం 19వ వార్డు సూదికొండ గ్రామం. ఇక్కడ 152 మంది పిల్లలం చదువుకునే మండల ప్రాథమిక పాఠశాలలో ఇది వరకు నీరు లేకుండా చిన్నపాటి మరుగుదొడ్లు ఉండేవి. ప్రస్తుతం వాటిని తొలగించి రూ.8 లక్షలతో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏకంగా మల్టీపర్పస్‌లో ఉపయోగపడే గదినే నిర్మించారు. చాలా సంతోషంగా ఉంది. మా ఇంట్లో సైతం ఇలాంటి సౌకర్యాలు లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– కె.తరుణ్, ఎం.వంశీ, ఎంపీపీ స్కూల్, సూదికొండ, పలాస–కాశీబుగ్గ

మూడో విడత బస్సు యాత్రకు ఏర్పాట్లు



సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, నారాయణమూర్తి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో మూడో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 13వ తేదీన నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్, ఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పీవీపీ సత్యనారాయణ రాజు(సురేష్‌బాబు), నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకం రెడ్డి నారాయణ మూర్తిలతో కలిసి సభా వేదిక స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఆల్‌ఆంధ్రా రోడ్డు కూడలి, బూరగాం గ్రామ సచివాలయ భవనం, నవతల కూడలి, కల్లట గ్రామాలను పరిశీలించారు. మొదటి రెండు విడతల్లో సభలు విజయవంతమయ్యాయని, మూడో విడత కూడా విజయవంతం చేయాలని కోరారు. పాతపట్నం ప్రధాన రహదారిపై బ్రాహ్మణ వీధి కూడలి వద్ద సభ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు మురళీ ఆప్టో, నల్లి రాజారావు, బిజిలి పుల్లాయ్, కర్రి లక్ష్మినారాయణ, రామక్రిష్ణ, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు శ్రీకారం

- పాలిటెక్నిక్ విద్యలో సిలబస్ మార్పు
- కరిక్యులమ్–2023 అమలు



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ విద్యలో సిలబస్ మార్పులుచేస్తున్నారు. పరిశ్రమల్లో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, నిష్ణాతులైన ఉద్యోగులను తయారు చేసే లక్ష్యంతో సాంకేతిక విద్యా శాఖ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే కరిక్యులమ్–2023ను అమలు చేస్తోంది.

జిల్లాలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. ఐదు ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ఏటా 1200 మంది విద్యార్థులు రిలీవ్ అవుతున్నారు. ఇందులో 25 శాతం మంది ఉద్యోగాల్లో చేరుతుండగా, 60 శాతం మంది ఈసెట్ రాసి ఇంజినీరింగ్‌లో చేరుతున్నారు. డిప్లమా విద్యకు ప్రభుత్వం జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వర్తిస్తుండగా, ఇంజినీరింగ్‌కు సైతం విద్యా, వసతి దీవెనలు వర్తిస్తున్నాయి. అర్హత గల విద్యార్థులకు ఉచితంగా విద్య అందుతుండటం వల్ల ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సాంకేతిక విద్యాశాఖ మాత్రం డిప్లమా తర్వాత ఉద్యోగాలకు ఎక్కువ మంది వెళ్లాలన్న లక్ష్యంతో స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. అంతర్జాతీయ సాంకేతిక మార్పులు, పారిశ్రామిక మార్పులకు అనుగుణంగా సిలబస్‌ను మారుస్తోంది.

కోర్సుల్లో 80 శాతం ఎక్స్‌టర్నల్, 20 శాతం ఇంటర్నల్ ఎగ్జామినేషన్స్ అమలు చేస్తోంది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్, కన్‌స్ట్రక్షన్స్, ఆటో మొబైల్స్, ఎలక్ట్రికల్, మ్యానుఫాక్చరింగ్, ఫార్మసీ, కెమికల్ వంటి పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, విషయ పరిజ్ఞానం లక్ష్యంగా విద్యను అందిస్తున్నారు. మరోవైపు బిగ్ డేటా క్లౌడ్ కంప్యూటరింగ్, ఎంప్లాయిబులిటీ స్కిల్స్, ఉద్యోగ అవసరాలకు తగ్గ శిక్షణ, రీజనింగ్, ప్రయోగాత్మక విద్య వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నిరంతరం ప్రాజెక్టు వర్క్‌లు, సెమినార్లు, నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు వంటి వాటిని విద్యలో భాగం చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు పెరుగుతాయి



మూడేళ్ల డిప్లమాలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వటం వల్ల నేరుగా పరిశ్రమల్లో పనిచేసే నైపుణ్యాలు లభిస్తాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో నైపుణ్యాలు ఉంటే మంచి వేతనంతో కూడిన ప్యాకేజీ ఇస్తారు. ప్రస్తుతం పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

– కె.సురేష్, కంప్యూటర్ ఇంజినీరింగ్ డిప్లమా

నైపుణ్యాలకు ప్రాధాన్యత



గతంలో థియరీ, పరీక్షలకు ప్రాధాన్యత ఉండేది. ప్రస్తుతం మాత్రం నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. చదువుతున్న బ్రాంచ్‌లో ప్రస్తుత పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు, పరిశ్రమల్లో చేయాల్సిన పనిపై విద్యలో ఫోకస్ పెడుతున్నారు.

– బి.సాయిదుర్గ, సివిల్ ఇంజినీరింగ్ డిప్లమా

సిలబస్‌లో మార్పులు



సాంకేతిక విద్యాశాఖ అంతర్జాతీయంగా వస్తున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేసింది. కరిక్యులమ్–2023 అమలు చేసున్నాం. విద్యార్థుల్లో పూర్తిస్థాయి నైపుణ్యాలు కల్పిస్తున్నాం. ప్రతి విద్యార్థి నైపుణ్యం సాధించేలా శిక్షణ సాగుతుంది. ఇంటర్న్‌షిప్‌తో పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానం సాధ్యమవుతుంది. విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు తెలుసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

– గురుగుబెల్లి దామోదర్ రావు, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

వైభవంగా మహాకుంభాభిషేకం



భీమేశ్వరునికి అభిషేకం చేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కొన్నావీధిలోని రాజరాజేశ్వరి సహిత భీమేశ్వరస్వామి దేవాలయంలో సహస్ర కలశ స్నపన మహా కుంభాభిషేక త్రయాహ్నిక దీక్షా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. స్వామికి ఆయన అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంత్రి ధర్మానను ఘనంగా సత్కరించారు. రేజేటి శ్రీనివాసాచార్యులు, ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, వేద పండితుల పర్యవేక్షణలో సకలదేవతా పూజలు, పంచరుద్రం, మృత్యుంజయ హోమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మండవిల్లి రవి, పూణ్ణ అనంత కృష్ణ, కింతలి సాయికృష్ణ, రాకోటి శివ సాయి, లాడె వెంకటరమణ, లక్ష్మణదాస్, ఆలయ అర్చకులు పార్వతీశం, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో కార్తీక సందడి



సాధారణ క్యూలో ఉన్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుంచే ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక అలంకరణతో ఆదిత్యుడిని అలంకరించి ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు మౌలిక సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇక భక్తులకు ఆరోగ్యం కోసం ప్రత్యేక సూర్యనమస్కార పూజలను చేయించుకున్నారు. అలాగే కేశఖండన శాలలో మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలావుంటే ఇంద్ర పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలను చేసి స్వామికి అర్ఘ్యం సమర్పించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇక ఆదివారం నాడు ఒక్క రోజులో ప్రత్యేక, విశిష్ట, ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ. 6,64,900, విరాళాల ద్వారా రూ.85,912, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.15 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలియజేశారు.

తీరంలో విహారం

కార్తీక ఆదివారం సందర్భంగా సముద్ర తీరాలు కళకళలాడాయి. గార మండలం మొగదాలపాడు తీరానికి సందర్శకులు పోటెత్తారు. బీచ్‌లో స్నానాలు చేసి సందడిగా గడిపారు.

– గార



క్లుప్తంగా

అధికారుల వసతి గృహ సముదాయం పనులు ప్రారంభం



భవన నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎం పురం క్యాంపస్‌లో అధికారుల నివాస వసతి సముదాయం పనులు ప్రారంభించారు. రూ. 4.20 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తోంది. ప్రధాన పోర్టు పోలియో ఉన్న అధికారులు స్థానికంగా నివాసం ఉంటే విద్యార్థులకు అందుబాటులో ఉంటారు. రెడిసెన్షియల్ క్యాంపస్ కావటం వల్ల నిరంతరం అధికారుల పర్యవేక్షణ అవసరం. ఇటీవల ఈ భవన నిర్మాణాలకు రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనులను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటధన బాలాజీ పర్యవేక్షిస్తున్నారు. వీలైనంత త్వరగా భవనాలు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ పరిధి సన్యాసినీలాపురం గ్రామానికి చెందిన రంగం అరుణ అనే వివాహిత ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరుణకు వివాహమైన నాటి నుంచి భర్త ధర్మారావు పనికి వెళ్లకపోవడంతో ఇంటిలో తరచూ గొడవలు జరుగుతుండేవి. శనివారం రాత్రి కూడా గొడవ జరగడంతో టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయితే ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె ఆదివారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కిందకు దించి హుటాహుటిన టెక్కలి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించారు.

అర్ధరాత్రి ఇంటిలో చోరీ

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి గోపినాథపురానికి చెందిన గుణ రమేష్ అనే వ్యక్తి ఇంటిలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. గుణ రమేష్ భార్య ఊరికి వెళ్లడంతో ఆయన శనివారం రాత్రి సినిమాకు వెళ్లారు. అర్ధరాత్రి దాటాక ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువాలోని సుమారు రూ.20వేలు, రెండు తులాలు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కిశోర్‌కుమార్



శ్రీకాకుళం న్యూకాలనీ: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన సీనియర్ ఉపాధ్యాయులు సంపతిరావు కిశోర్‌కుమార్ ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో కిశోర్‌కుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఇదే కౌన్సిల్ సమావేశాల్లో జిల్లాకు చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకులు చౌదరి రవీంద్ర, ఆర్.దమయంతిలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరి నియామకంపై జిల్లాకు చెందిన యూటీఎఫ్ బాధ్యులు, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

'సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా'



జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయకు వినతి పత్రం అందిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

కవిటి: జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 100 మందికి పైగా అతిథి ఉపన్యాసకుల సమస్యల్ని సీఎం వైఎస్ జగన్‌కు వివరించేందుకు ప్రయత్నిస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బల్లిపుట్టుగలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నివాసంలో జిల్లా అతిథి ఉపన్యాసకుల సంఘం నేతలు ఆమెను ఆదివారం కలిసి తమ సమస్యలు వివరించారు. సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని కోరారు. సీఎం జిల్లా పర్యటనకు వస్తున్నారని, సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు భారతి, ఈశ్వరరావు, కృష్ణారావు, రామారావు, లోకేశ్వరరావు, దేవరాజు, బాలదండాయుధపాణి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పర్వం

- 15 నుంచి మొదలుకానున్న 'ఆడుదాం ఆంధ్రా' మెగా టోర్నమెంట్
- ఇప్పటికే మండల కేంద్రాలకు స్పోర్ట్స్ కిట్ల తరలింపు పూర్తి
- ఐదు స్థాయిల్లో అత్యంత ఆదరణ కలిగిన ఐదు క్రీడాంశాల్లో పోటీల పర్వం




కబడ్డీ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదిహేనేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆడేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో క్రీడాపోటీలను నిర్వహిస్తోంది. వీటితో పాటు స్థానికంగా ఆదరణ కలిగిన సంప్రదాయ క్రీడలను కూడా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇప్పటికే సంబంధిత అధికారులు, ఒలింపిక్ సంఘం, క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు.



15 నుంచి క్రీడాపోటీలు..

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కింద క్రీడాపోటీలు డిసెంబరు 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 3 వరకు దాదాపు నెలన్నర రోజులపాటు మ్యాచ్‌ల నిర్వహణతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సందడి నెలకొననుంది. తొలుత సచివాలయ పరిధిలో పోటీలు నిర్వహిస్తారు. సచివాలయం స్థాయిలో క్రీడలన్నీ 12 రోజులపాటు కొనసాగనున్నాయి. ప్రతి సచివాలయంలో పురుషులు రెండు టీములు, మహిళలు రెండు టీములు మొత్తంగా నాలుగు టీములు ఆడేలా షెడ్యూల్ తయారుచేయనున్నారు. ఈ పోటీల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హులు కారు. సచివాలయం స్థాయిలో గెలుపొందిన జట్లకు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి ఇలా ఐదు స్థాయిల్లో పోటీలు జరపనున్నారు.



వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

విజేతలకు భారీగా బహుమతులు..

సచివాలయం, మండల స్థాయిలో ఆడి గెలిచిన జట్లకు వారు ఆడిన క్రీడా కిట్లు అందిస్తారు. గ్రామ, మండల స్థాయిలో విజేతలు నియోజకవర్గ స్థాయిలో ఆడతారు. నియోజకవర్గంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నాలుగు క్రీడాంశాల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.35వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తారు. జిల్లాస్థాయి విజేతలకు మొదటి బహుమతిగా రూ. 60వేలు, రెండో బహుమతిగా రూ. 30వేలు, మూడో బహుమతిగా రూ. 10వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు మొదటి బహుమతిగా రూ. 5లక్షలు, రెండో బహుమతిగా రూ.3లక్షలు, మూడో బహుమతిగా రూ. 2లక్షలు అందజేయనున్నారు.

మండల కేంద్రాలకు స్పోర్ట్స్ కిట్‌లు..

- జిల్లాలోని 30 మండలాల పరిధిలోని 912 పంచాయితీలు ఉండగా.. 835 సచివాలయాలు ఉన్నాయి.
- సచివాలయాల పరిధిలో పోటీల కోసం సచివాలయాలకు అందించే స్పోర్ట్స్ కిట్‌లను ఇప్పటికే మండల కేంద్రాలకు చేరవేశారు. వీటిని సచివాలయాలకు చేర్చనున్నారు.
- ఈ సచివాలయాల్లో ఇప్పటికే జోరుగా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి.
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 16,900 మంది వరకు యువత రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.
- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వసతుల కల్పనకు నడుంబిగించారు.
- పోటీల నిర్వహణకు అంపైర్లకుగాను 250 మంది పీఈటీలు, పీడీలు, డీఎస్‌ఏ కోచ్‌లు 10 మంది, మరో 100 మంది వరకు సీనియర్ క్రీడాకారులను కలుపుకుని 360 మందిని ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా క్రీడలు



రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్లు నిండినవారెవరైనా ఈ క్రీడల్లో పాల్గొనవచ్చు. ఆపై ఎలాంటి వయో పరిమితి లేదు. జిల్లాలో ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీలకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైదానాలు సిద్ధం చేస్తున్నాం. తుఫాను కారణంగా కొంత అంతరాయం ఏర్పడింది. గడువు ముగుస్తుంది కాబట్టి పోటీల్లో పాల్గొనేవారు త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలి.

– డాక్టర్ కళ్లేపల్లి శ్రీధర్‌రావు, డీఎస్‌డీవో శ్రీకాకుళం

మెదడుకు పదును పెడుతూ..



సాక్షి స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ఘనంగా ముగిసిన 'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు
- ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ విద్యా సంవత్సరానికిగాను జిల్లా స్థాయి 'సాక్షి' స్పెల్ బీ, మాథ్స్ బీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఏటా ఈ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయ పాఠశాలలో ఆదివారం సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ జిల్లాస్థాయి పరీక్ష జరిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాశారు.

1 నుంచి 9వ తరగతి వరకు..

వివిధ కేటగిరీల వారీగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'సాక్షి' మీడియా గ్రూప్ జిల్లా ప్రతినిధుల పర్యవేక్షణలో పాఠశాల ప్రతినిధులు సమక్షంలో పరీక్షలు జరిగాయి. పరీక్షలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వ్యాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్' వ్యవహరించాయి. సాక్షి అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలను నిర్వహిస్తున్న సాక్షి మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆనందంగా ఉంది..



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలకు హాజరుకావడం ఆనందంగా ఉంది. మా పేరెంట్స్‌తో పరీక్షకు వచ్చాను. మంచి ఎక్స్‌పీరియన్స్ వచ్చింది.

– రాహుల్, 4వ తరగతి, శ్రీచైతన్య స్కూల్ శ్రీకాకుళం

బాగా రాశాను..



సాక్షి కాంటెస్ట్ పరీక్షను బాగా రాశాను. గత కొద్దిరోజులుగా బాగా ప్రిపేరయ్యాను. మా ఇంట్లోను ముఖ్యంగా స్కూల్‌లో పరీక్ష కోసం మా ఉపాధ్యాయులు సన్నద్ధం చేశారు.

– సాత్విక్, 9వ తరగతి, విశాఖ స్కూల్ శ్రీకాకుళం

నాపై నాకు నమ్మకం కలిగింది..



సాక్షి కాంటెస్ట్ ఎగ్జామ్‌కు హాజరుకావడం, ఇందుకోసం గత కొద్దిరోజులుగా పరీక్షకు సన్నద్ధం కావడంతో నాపై నాకు నమ్మకం కలిగింది. పరీక్షను బాగా రాశాను.

– దుర్గాభవాని, 8వ తరగతి, శర్వాణి స్కూల్ శ్రీకాకుళం

వచ్చే ఏడాది కూడా హాజరవుతా..



సాక్షి స్పెల్ బీ, మాథ్స్ బీకి హాజరుకావడం హ్యాపీగా అనిపించింది. వచ్చే ఏడాదికి బాగా ప్రిపేర్ అవుతాను. పరీక్షకు కూడా హాజరవుతాను.

– రవీన,4వ తరగతి, శర్వాణి స్కూల్ శ్రీకాకుళం

సాక్షికి థాంక్స్..



ముందుగా సాక్షి మీడియాకు థ్యాంక్స్. విద్యార్థుల భవిష్యత్ కోసం వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడం కోసం ఏటా సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ బీ నిర్వహిస్తోంది. పరీక్షకు హాజరుకావడం సంతోషంగా ఉంది.

– కిరణ్‌కుమార్, 10వ తరగతి, నారాయణ స్కూల్ కుంటికోట

కాశీబుగ్గలో అగ్రిగోల్డ్ బాధితుల నిరసన దీక్ష



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు

కాశీబుగ్గ: అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం దొంగల్ని శిక్షించాలంటూ పలువురు బాధితులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దీక్షల్లో భాగంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద అగ్రిగోల్డ్ బాధిత సంఘం ఆదివారం దీక్షలు చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని పలాస సీపీఐ నాయకులు చాపర వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జయసింహా, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆరేలమ్మ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో పేదలు అగ్రిగోల్డ్‌లో డబ్బులు దాచుకున్నారని, అదనపు వడ్డీ వస్తుందనే ఆశతో లక్షలాది మంది మహిళలు, పొదుపుకి దగ్గరి మార్గంగా భావించి నిరుపేద శ్రామిక ప్రజలు దాచుకున్న సొమ్మును తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గ అగ్రిగోల్డ్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ పాత్రో, శ్రీనివాస్ పాత్రో, ఏజెంట్లు, కస్టమర్లు, వామపక్ష నాయకులు చాపర సుందరలాల్, వంకల మాధవరావు, దున్న శ్రీనివాస్, తెప్పల అజయ్‌కుమార్ వివిధ ప్రజాసంఘాలు పాల్గొన్నారు.

మల్లన్న దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం



పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారంలో దువ్వాడ వాణి, కిల్లి కృపారాణి తదితరులు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచే విధంగా పాలక మండలి సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పేర్కొన్నారు. ఆలయ చైర్మన్‌గా సర్లాన సుధాకర్‌తో పాటు మరో 10 మందితో పాలక మండలి సభ్యులు కొలువుదీరారు. వాణి మాట్లాడుతూ.. కొత్తగా కొలువుదీరిన పాలక మండలి సభ్యులంతా ఆధ్యాత్మిక చింతనతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ...ప్రపంచంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన మల్లన్న ఆలయానికి పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు స్వీకరించడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ సర్లాన సుధాకర్ మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలతో మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం.కిశోర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు చింతాడ గణపతి, ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్‌బాబు, వి.రాధాకృష్ణ, అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం గ్రామ సమీపంలోని తోటల్లో పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. రూ.4020 స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు.

పోటాపోటీగా మిస్టర్ ఆంధ్రా పోటీలు

రాజాం సిటీ: వ్యాయామంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జీఎంఆర్ ఐటీలో ఏపీ మిస్టర్ ఆంధ్రా ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. రాత్రి 9.30 గంటల వరకు ఈ పోటీలు జరగ్గా 11 జిల్లాల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొని శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. మొత్తం 8 కేటగిరీలలో నిర్వహించిన ఈ పోటీల్లో 55 కిలోల విభాగంలో ఎ.రాజేష్, జి.రాంబాబు (విజయనగరం), పి.రాజేష్ (శ్రీకాకుళం), ఎ.చిరంజీవి (తూర్పు గోదావరి), పి.మోహన్ (విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లో నిలిచారు. 60 కేజీల విభాగంలో ఈవీఎస్ కుమార్ (గుంటూరు), ఎస్‌కే అబ్దుల్ ఖాన్ (శ్రీకాకుళం), ఎస్.వంశీమెహర్(విశాఖపట్నం), జె.కల్యాణ్ (తూర్పు గోదావరి), ఆర్.హరీష్ (శ్రీకాకుళం)లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. 65 కేజీల విభాగంలో కె.గౌరీశంకర్ (శ్రీకాకుళం), ఎల్.దుర్గాప్రసాద్, బి.లక్ష్మణరావు (తూర్పు గోదావరి), పి.రాజ్‌దేవ్ (శ్రీకాకుళం), ఎం.చంద్రమౌళి (విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లోను, 70 కేజీల విభాగంలో ఎం.సాయిదీపక్ (విజయనగరం), టి.మహీంద్ర (తూర్పుగోదావరి), బి.చంద్రశేఖర్, వై.వినయ్‌కుమార్, కె.అంజి (విజయనగరం)లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. అలాగే 75 కేజీల విభాగంలో ఎన్.రవికుమార్ (గుంటూరు), ఎస్.భాస్కర్ (శ్రీకాకుళం), జె.రవితేజ, ఎస్.కిరణ్‌కుమార్, వి.బాలకృష్ణ(విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లో నిలిచారు. 80 కేజీల విభాగంలో ఎస్.రమేష్ (తూర్పుగోదావరి), కె.భార్గవ్‌రామ్, కె.బాలాజీ, జి.రాఘవ (విజయనగరం), జె.గణేష్ (శ్రీకాకుళం)లు వరుస స్థానాల్లో నిలిచారు.

వలస జీవి అదృశ్యం



కుటుంబ సభ్యులతో యర్రయ్య

పోలాకి: మండలంలోని గుప్పెడుపేట గ్రామానికి చెందిన వలస మత్స్యకారుడు చక్కా యర్రయ్య(50) కర్నాటకలోని మంగుళూరు నుంచి తిరిగి వస్తున్నట్లు సమాచారం ఇచ్చి వారం రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యర్రయ్యతోపాటు దాదాపు 100 మంది వరకు గ్రామం నుంచి మత్స్యకారులు వలస వెళ్లారు. ఈ నెల 2న యర్రయ్య కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఇంటికి వస్తున్నానని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఇంటికి చేరలేదు. దీంతో ఆయన భార్య పైడమ్మ గ్రామ పెద్దలు, సంఘ నాయకుల దృష్టికి సమాచారాన్ని తీసుకెళ్లారు. మంగుళూరులో యర్రయ్య పనిచేసే చోట సైతం ఆరా తీయగా అక్కడా లేరు. యర్రయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. నిరక్షరాస్యుడైన యర్రయ్య ఎక్కడైనా కనిపిస్తే 9347643293, 6301501093 నంబర్లకు సమాచారం ఇవ్వాలని మత్స్యకా రసంఘ నాయకుడు, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య కోరారు.

రైలు కింద పడి ఆత్మహత్య



రాణి కుమారి డిఫెన్స్ ఐడీ కార్డు



పలాసకు సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో రాణి కుమారి అనే మహిళ ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా నిలబడి ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. లోకో పైలెట్ ఎంతగా హారన్ కొట్టినా ఆమె పక్కకు తప్పుకోలేదు. స్థానికులు, లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఆమె వద్ద డిఫెన్స్ కార్డు లభించిందని, దానిపై రాణికుమారి అనే పేరుందని జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆమె భర్త దివాకర్ కుమార్ సింగ్ హవల్దార్ సిఐ కేఎస్‌డీ అని ఐడీ కార్డుపై ఉందని పేర్కొన్నారు. పలాస జీఆర్పీ ఎస్ఐ కె.షరీఫ్ కేసు దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

జిల్లా కేంద్రంలో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్‌కు ముందు ఐదు బృందాలుగా సిబ్బందికి డ్యూటీ వేస్తున్న సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పలుచోట్ల ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు జరిపితే ఊరుకునేది లేదని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని బలగ సమీపాన ఉన్న బావాజీనగర్‌లో వేకువజాము నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మి, ఏఎస్ఐలు శంకర్, అరుణ, 35 మంది వరకు స్టేషన్ సిబ్బంది 311 ఇళ్లను సెర్చ్‌లో భాగంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న 214 ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను, ఒక కారును పరిశీలించి రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నివాస గృహాల వారితో సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద రీతిలో కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవడమే కాక.. షీట్లు కూడా తెరవాల్సి ఉంటుందన్నారు. వాహనాల్లో నిషేధిత మత్తుపదార్థాలైన సారా, గంజాయి, అక్రమ మద్యం, ఇతరత్రా తీసుకెళ్లరాదని, గంజాయి అమ్ముతున్నట్లు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వరాదని, మైనరు అమ్మాయిలతో వస్తే పోలీసులకు చెప్పాలన్నారు. ద్విచక్రవాహనాలు కొనేటప్పుడు సంబంధిత పత్రాలు లేకుండా కొనకూడదని, కొన్నా వారి నుంచి పత్రాలను ట్రాన్స్‌ఫర్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..



శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం స్కూల్‌లో 1979-80లో టెన్త్ చదివిన వారు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలిసి ఆనాటి ముచ్చట్లు గుర్తు చేసుకున్నారు. పాఠాలు బోధించిన వారిని సత్కరించారు. – శ్రీకాకుళం న్యూకాలనీ